యూనియన్ కార్బైడ్‌కార్పొరేషన్ తన ప్రపంచ సామ్రాజ్యంలో భాగంగా 1969లో భోపాల్ లో ఒక క్రిమి సంహారక మందుల కర్మాగారాన్ని నెలకొల్పింది. 5000 టన్నుల ఉత్పాదన శక్తి ఉన్న మిథైల్ ఐసోసయనేట్ (మిక్) ప్లాంటు 1979 డిసెంబరులో ఉత్పత్తి ప్రారంభించింది. 1984 డిసెంబర్ 2 రాత్రి 9.30 కు ఈ మిక్ ప్లాంట్ లో ఘోరమైన ప్రమాదం సంభవించింది. 610 నెంబరుగల మిక్ స్టోరేజ్ ట్యాంక్ లోకి పెద్ద రాశిలో నీరు ప్రవేశించింది. దాని ఫలితంగా ప్రారంభమైన రసాయనిక చర్యవల్ల ఆ ట్యాంకులో ఉష్ణం, పీడనం విపరీతంగా పెరిగాయి. 40 టన్నుల మిక్ వాయువు, హైడ్రోజన్ సైనైడ్ తదితర ఇతర రసాయన పదార్థాలు ట్యాంక్‌ను బద్దలు చేసుకొని బయటి కొచ్చాయి. అప్పటికి రాత్రి 12.30 అయింది. ప్లాంట్‌లో భద్రతా ఏర్పాట్లు తగిన రాశిలో లేవు. పైగా అని కూడా పనిచేయడంలేదు. విషవాయువు ట్యాంక్ నుండి బయటకు రావడానికి ఒక గంట ముందే అది పెద్ద మోతాదులో ట్యాంక్‌లో జమ అవుతూ ఉందని ఫ్యాక్టరీ అధికార్లకు తెలుసును. అయినప్పటికీ పరిసర ప్రజలను అప్రమత్తం చేసే సైరన్ వెంటనే మోగించలేదు సరిగదా, విషవాయువు లీక్ అయిన తరువాత ఒక గంటకు మోగించారు.

అప్పటికి విషవాయువు 40 చ.కి.మీలు వ్యాపించిపోయింది. దాని ఫలితంగా అప్పటికప్పుడే వేలాది మంది చనిపోయారు. విషవాయు మేఘాలు నాలుగు గంటలుపైగా నేలను ఆవరించి ఉన్నాయి. కళ్లు మంటలు, వాంతులు, ఊపిరాడకపోవడం తదితర రోగలక్షణాలు గల 5 లక్షల మంది ప్రజలు ఆ విషవాయువునుండి తప్పించుకొని పారిపోజూసారు.

ఆ తరువాత పది సంవత్సరాలు గడిచాయి. ఆనాడు విషవాయువు వల్ల దెబ్బ తిన్నవాళ్లు ఇప్పటికీ చనిపోతూ ఉండడం భోపాల్ కు సంబంధించిన ఒక బాధాకరమైన వాస్తవం. మరణాల సంఖ్యమ తగ్గించి చెప్పడానికి అలవాటు పడిన భారత ప్రభుత్వం సహితం మృతుల సంఖ్యను ఇంకా పెరుగుతూ ఉందని ఒప్పుకుంటున్నది. 1992 డిసెంబర్ నాటికి 5325 మంది చనిపోయినట్టు భోపాల్‌లోని వెల్ఫేర్ కమిషనర్ కార్యాలయం విడుదల చేసిన లెక్కలు చెప్తాయి. 1984 డిసెంబర్ 15 నాటికి మరణించిన వారి సంఖ్య 2500 అని అధికారగణాంకాలు చెప్తాయి కాబట్టి, వెంటనే చనిపోయిన వారి కంటె తరువాత 8 సంవత్సరాలలో చనిపోయిన వారి సంఖ్య ఎక్కువ అని దీనిని బట్టి అర్థం అవుతుంది.

## కొనసాగుతున్న భోపాల్ పీడకల

అయితే నిజానికి అధికార గణాంకాలు వెల్లడించిన మృతుల సంఖ్య అసలు సంఖ్య కంటే తక్కువ అని నమ్మడానికి చాలా ఆధారాలున్నాయి. ప్రమాదం జరిగిన తరువాత వారం రోజులలో భోపాల్ పట్టణాన్ని వదిలి పారిపోయిన 4 లక్షల మందిలో ఎంత మంది చనిపోయారో లెక్కపెట్టినవారు లేరు. అంతేకాక, తరువాతి సంవత్సరాలలో విషవాయు ప్రభావం ఫలితంగా వచ్చిన రోగాల వల్ల చనిపోయిన వారందరి వివరాలూ సేకరించే సమర్థ వంతమైన ఏర్పాటేదీ ఉండలేదు. అనధికార అంచనాల ప్రకారం మిక్ ప్రమాదం జరిగిన వెంటనే చనిపోయిన వారి సంఖ్య 8000 పైబడి ఉండగా, ఆ తరువాత విషవాయు సంబంధిత రోగాల వల్ల చనిపోయిన వారితో కలుపు కొని మొత్తం మృతుల సంఖ్య నేటికి 16000 ఉంటుంది.

డిసెంబర్ 1992 తరువాత విషవాయు సంబంధిత రోగాల వల్ల చనిపోయేవారి వివరాలు నమోదు చేసే కమిటీ మూతపడింది. ఆ రకమైన మరణాల గురించి ఎవరయినా సమాచారం అందించి నష్టపరిహారం కోరితే ఆ అర్జీని రిజిస్టర్ చేసుకోవడం మానేసారు. అయితే నెలకు 10 మంది చొప్పున చనిపోతూనే వున్నారు.

ఈ డిసెంబరు 2 వ తేదీనాటికి భోపాల్ మారణకాండ జరిగి ఒక దశాబ్దం గడిచిపోతుంది. ఈ సందర్భంగా భోపాల్ బాధితులకు న్యాయం జరగాలని ఆందోళన చేస్తున్న రెండు సంస్థలు ప్రస్తుత పరిస్థితిని సమీక్షిస్తూ 'భోపాల్ లివ్స్ 1984-1994' అనే ప్రచురణ తీసుకొచ్చాయి. ఆ సంస్థలు భోపాల్ గ్యాస్ పీడిత సంఘర్ష్ సహయోగ్ సమితి (BGPSSS), భోపాల్ గ్రూప్ ఫర్ ఇన్ఫర్మేషన్ అండ్ ఆక్షన్ (BGIA) లు. ఆ ప్రచురణలో కొంత భాగాన్ని అనువదించి ఇక్కడ ఇస్తున్నాము.




భోపాల్ విషవాయు పీడిత ప్రజల అనారోగ్య సమస్యలు పెద్ద ఎత్తున కొనసాగుతూనే వున్నాయి. వాటి ఫలితంగా నెలకు 10 మంది ఈ నాటికీ చనిపోతూనే ఉన్నారు. బతికున్నవాళ్లు పని చేసుకోలేక పోతున్నారు. సాధారణ జీవితం గడపలేకపోతున్నారు. వాళ్లకు ప్రభుత్వం కల్పిస్తానన్న పునరావాసం కల్పించలేదు. కట్టిస్తామన్న ఇళ్లు కట్టియ్యలేదు. పోనీ కోటానుకోట్ల ఆస్తులున్న కార్బైడ్ కంపెనీ నుండి భారత ప్రభుత్వంగానీ న్యాయవ్యవస్థగానీ బాధితులకు తగిన మొత్తంలో నష్టపరిహారం ఇప్పించగలిగాయా అంటే అదికూడా లేదు.

ఇవీ ఈ నివేదికలో మనకు కనిపించే కఠోరసత్యాలు.

## ఆరోగ్యం మీద విషవాయు ప్రభావం - ప్రభుత్వ సమాచారం

మృతుల సంఖ్యలాగానే , విషవాయువు వల్ల ప్రజల ఆరోగ్యం మీద పడే తక్షణ, దీర్ఘకాలిక ప్రభావాల గురించి సమాచారం కూడ ప్రభుత్వ సంస్థలే సేకరించాయి. వీటిలో ప్రధానమయినది ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసర్చ్ (ఐ.సి.ఎం.ఆర్.). ఆ విషవాయువుకు వివిధ శరీర భాగాలమీద ఉండ గల ప్రభావాన్ని అర్థం చేసుకోవడానికి ఐసిఎంఆర్ 1985 తొలి భాగంలో 25 పరిశోధనా ప్రాజెక్టులు చేపట్టింది. విషవాయు దుర్ఘటన విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని అనుసరించి ఈ ప్రాజెక్టు నివేదికలు కూడ విషవాయు ప్రభావం ఫలితాన్ని తక్కువ చేసి చూపించాయి. అయినప్పటికీ వారి నివేదికలు యూనియన్ కార్బైడ్ భోపాల్ ప్రజలను ఎంతటి దురవస్థలకు గురి చేసిందో తెలియజేస్తాయి. 1984లో విషవాయువు ప్రభావానికి గురయిన వారి సంఖ్య 5,21,262 అని ఐసిఎంఆర్ అంచనా వేసింది. వారిలో స్త్రీలయిన వారికి తరువాత కాలంలో పుట్టిన పిల్లల మీద కూడ విషవాయువు ప్రభావం పడింది.

ప్రత్యక్షంగానో పరోక్షంగానో విషవాయువు ప్రభావం పడిన వ్యక్తుల ఆరోగ్య స్థితిగతుల గురించి ఐసిఎంఆర్ వెల్లడించిన కొన్ని విషయాలు:

-- విషవాయువులు ఊపిరితిత్తుల ద్వారా నెత్తుటి లోకి ప్రవేశించాయి. ఊపిరితిత్తులకు, మెదడుకు, మూత్రపిండాలకు , కండరాలకు దీని వల్ల దెబ్బ తగిలింది. అంతే కాక విషవాయువు పీల్చిన వారి శరీర పునరుత్పత్తి వ్యవస్థరోగ నిరోధక వ్యవస్థ, జీర్ణ వ్యవస్థ దెబ్బతిన్నాయి.

-- ప్రమాదం జరిగిన వెంటనే ఒక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందిన వారిలో 98.9 శాతానికి శ్వాస సంబంధమైన సమస్యలు, 91 శాతానికి జీర్ణవ్యవస్థకు సంబంధించిన సమస్యలు ఉన్నాయి. ఏదో ఒక మోతాదులో మరొక 16 రకాల ఆరోగ్య సమస్యలు కూడ ఉన్నాయి. కాగా, ఐసిఎంఆర్ తన ఆఖరి నివేదిక ప్రచురించిన సంవత్సరం (1992) దాకా వీటిలో 10 సమస్యలు బాధితుల ఆరోగ్యాన్ని పీడిస్తూనే ఉన్నాయి. అంతేకాక స్త్రీల రుతుక్రమం అస్తవ్యస్తం కావడం, నిష్కారణంగా గర్భస్రావం కావడం, కీళ్లు అచేతనమయి పోవడం, మానసిక ఆరోగ్యానికి సంబంధించిన సమస్యలు బాధితులలో పొడచూపాయి.

-- 1985 డిసెంబర్ నాటికి విషవాయు పీడితుల శరీర రోగ నిరోధక వ్యవస్థ లో తీవ్రమైన సమస్యలు పొడ చూపాయి. అసాధారణ మోతాదులో జన్యుకణాలలో విపరీతలక్షణాలు కనిపించాయి. ఊపిరి తిత్తులలో ఫైబ్రాసిస్ రోగం లక్షణాలు కనిపించాయి. విషవాయు పీడిత ప్రజలలో 22..6 శాతం వివిధ మానసిక రోగలక్షణాలు కనబరిచారు.

--1987 - 89 మధ్య కాలంలో జరిపిన పరిశోధనల ప్రకారం విషవాయువు లీక్ అయినప్పుడు 5 సం॥ లోపు వయసున్న పిల్లలు సగటు కంటె రెండు నుండి నాలుగు రెట్లు ఎక్కువగా జ్వరం, శ్వాస సంబంధమైన రోగాలు, వాంతులు, దగ్గు మొదలయిన రోగాలకు గురి అయ్యారు.

--1990 నాటికి కూడ వాయుపీడిత స్త్రీలలో గర్భస్రావం రేటు సగటు కంటె మూడు రెట్లు ఎక్కువ ఉంది. వారికి పుట్టిన పిల్లలలో శారీరక మానసిక మాంద్యం లక్షణాలు కనిపించాయి.

--1987 నుండి 1991 దాకా ఆరునెలల కొకసారి విషవాయుపీడితుల గురించి సర్వే చేసారు. రోగలక్షణాలు ప్రదర్శించిన వారి సంఖ్య ఒక సర్వే నుండి తరువాతి సర్వేనాటికి పెరగడం కనిపించింది. 1987 తో పోలిస్తే 1991 లో విషవాయు సంబంధిత రోగపీడితులు మూడు రెట్లు ఉన్నారు.

## ఆరోగ్యంమీద విషవాయువు ప్రభావం - ప్రభుత్వేతర సమాచారం

ప్రభుత్వేతర వైజ్ఞానిక నిపుణులు భారత దేశంలోను విదేశాలలోనూ ఈ విషయంపైన పరిశోధనలు జరిపారు. ఈ పరిశోధనలలో ఐసిఎంఆర్ పట్టించుకొని రోగలక్షణాలను లెక్కలోనికి తీసుకున్నారు. అంతేగాక ఈ పరిశోధనలు ఐసిఎంఆర్ నివేదికల కంటే నిర్దుష్టమైన సమాచారాన్ని అందిచ్చాయి.

--విషవాయు ప్రభావిత ప్రాంతాలలో ఆస్పత్రికి రాని జనంలో 50 శాతం నుండి 70 శాతం దాకా ఏదో ఒక వాయు సంబంధిత రోగలక్షణాన్ని ప్రదర్శించారు.

--1989 అక్టోబర్ లో ఢిల్లీకి చెందిన జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం నిర్వహించిన ఒక పరిశోధన ప్రకారం , విషవాయువు వల్ల తీవ్రంగా ప్రభావితమైన ప్రాంతాలలో 70 నుండి 80 శాతం ప్రజలు, స్వల్పంగా ప్రభావితమైన ప్రాంతాలలో 40 నుండి 50 శాతం ప్రజలు 5 సంవత్సరాల తరువాత కూడా విషవాయు సంబంధమైన రోగలక్షణాలు ప్రదర్శించారు.

--విషవాయువు ప్రభావం వల్ల బాధితుల శరీర రోగనిరోధక వ్యవస్థ దెబ్బ తింటుందన్న విషయాన్ని లండన్ స్కూల్ ఆఫ్ హైజీన్ అండ్ ట్రాపికల్ మెడిసిన్ కు చెందిన డాక్టర్ నీల్ ఆండర్సన్ ప్రయోగాత్మకంగా రుజువు చేసి 1989 లో వెల్లడించారు.

-- 1993 లో ఢిల్లీ విశ్వవిద్యాలయానికి చెందిన ఒక విద్యార్థి జరిపిన పరిశోధన ప్రకారం బాధితప్రాంతంలో 65శాతం ప్రజలు శ్వాస సంబంధమైన సమస్యల లోను, 68.4 శాతం ప్రజలు నాడీ మండలానికి సంబంధించిన సమస్యలతోను, 49 శాతం కంటి జబ్బులతోను బాధపడుతున్నారు. స్త్రీలలో 43.2 శాతం ప్రసూతి సంబంధమైన సమస్యలతో బాధపడుతున్నారు.

11 దేశాలకు చెందిన 14 మంది వైద్యనిపుణులతో ఏర్పడిన భోపాల్ అంతర్జాతీయ వైద్య కమిషన్ (ఐఎంసిబి) 1994 జనవరిలో భోపాల్‌లో పరిశోధనలు జరిపింది. ఈ కమిషన్ తుదినివేదిక 1994 డిసెంబర్‌లో రాసింది. అయితే తన మధ్యంతర నివేదికలో కమిషన్ రెండువిషయాలు చెప్పింది.

-- బాధితులలో చాలా మంది ఇప్పటికీ శ్వాస కోశానికీ నాడీ మండలానికీ సంబంధించిన తీవ్రమైన సమస్యలు ఎదుర్కొంటున్నారు.

--బాధిత ప్రాంతాలను ఇతర ప్రాంతాలనూ పోల్చి చూడగా, విషవాయువు ప్రభావం వల్ల ఊపిరి తిత్తులు బాగా దెబ్బ తిన్నట్టు, శరీర భాగాల కదలిక మీద అదుపు తగ్గినట్టు, జ్ఞాపక శక్తి తగ్గినట్టు స్పష్టంగా కనబడుతుంది.

ఏవిధంగా చూసినా భోపాల్ బాధితుల ఆరోగ్య భవితవ్యం ప్రమాద భరితంగా కనబడుతుంది. రోగనిరోధక వ్యవస్థ దెబ్బతినడం వల్ల అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. క్షయవ్యాధి చాలా ఎక్కువగా కనబడుతూ ఉంది. జీర్ణ కోశంలో కాన్సర్ లక్షణాలు పొడ చూపుతున్నాయి. జన్యు లక్షణాలలో కనిపిస్తున్న అనలక్షణాలను బట్టి చూస్తే రాబోయే కాలంలో పుట్టే పిల్లలలో ఆజన్మవైపరీత్యాలు ఉండవచ్చుననిపిస్తుంది.

## వైద్యసదుపాయం

ప్రమాదం జరిగిన రోజు ఏరకమైన వైద్యసదుపాయం ఉండిందో ఈరోజూ అదే ఉంది. యూనియన్ కార్బైడ్ వారు ఉత్పత్తి చేసే రసాయనిక పదార్థాలకు

మనుషుల శరీరాలపైన ఉండగల ప్రభావాన్ని గురించి కానీ, దానిని తొలగించే మార్గాల గురించి గానీ వైద్యులకు ఇప్పటికీ పూర్తిగా తెలియదు. వాళ్లు ఇప్పటికీ రోగ లక్షణాలను బట్టి తాత్కాలిక ఉపశమనం కలిగించే మందులు ఇస్తున్నారు. నగరంలోని ఆస్పత్రులలో రోగాలరద్దీ విపరీతంగా ఉంది (నాలుగు ప్రభుత్వ ఆస్పత్రులకు సగటున రోజుకు 4000 మంది రోగులు పోతుంటారు). లీక్ అయిన రసాయనిక పదార్థాలకు సంబంధించిన వైద్యసమాచారం అందుబాట్లో లేకపోవడం వైద్యులకు పెద్ద అవరోధంగా ఉంది. యూనియన్ కార్బైడ్ వాళ్లు సమకూర్చిన వైద్య సమాచారం అతి స్వల్పమే కాక విలువలేనిది. బహుశా అది తప్పుదోవ పట్టించే సమాచారం కావచ్చు. బాధితుల సంఘాలు సరైన వైద్య సమాచారం ఇమ్మని యూనియన్ కార్బైడ్ ను ఎన్నిసార్లు కోరినా అది వృథా ప్రయాసే అయింది. సరయిన సమాచారం లేకపోవడం వల్ల డాక్టర్లు విచ్చలవిడిగా బలమైన ఔషధాలు ఇస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రులలో ఇస్తున్న మందులలో 36.7 శాతం ప్రమాదభరితమైనవి, అనవసరమైనవి అని 1990లో జరిపిన ఒక పరిశోధన తెలిపింది.

అయితే బాధితులలో అధికభాగం ప్రైవేట్ డాక్టర్ల దగ్గరికే పోతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రికి పోతే డాక్టర్‌ను రెండు నిముషాలు చూడటం కోసం క్యూలో గంటల కొద్దీ నిలబడాలి. ప్రభుత్వ ఆస్పత్రులలోని పరిస్థితిని ఆసరా చేసుకొని ప్రైవేట్ డాక్టర్లు పబ్బం గడుపుకుంటున్నారు. చాలా మంది ప్రభుత్వ డాక్టర్లకే స్వంత ప్రైవేట్ క్లినిక్‌లు వున్నాయి. సంప్రదింపు ఫీజు 10 రూ॥ల నుండి 100 రూ॥ల దాకా వసూలు చేస్తున్నారు. భోపాల్ దుర్ఘటన ఈ వైద్యుల జాతికి గొప్ప అవకాశంగా దొరికింది. ప్రైవేట్ వైద్యులలో 70 శాతం సరైన పట్టాకూడా లేనివారే.

భోపాల్ బాధితులకు అందే వైద్యసదుపాయాలను, వారి ఆరోగ్య స్థితిపైన జరిపే వైజ్ఞానిక పరిశోధనలను పర్యవేక్షించడానికి ఒక జాతీయ వైద్య కమిషన్ ఏర్పాటు చేయాలని బాధితుల సంస్థలు డిమాండ్ చేస్తున్నాయి. కానీ భోపాల్ దుర్ఘటనను వీలయినంత త్వరగా మరచిపోదామని చూస్తున్న ప్రభుత్వం దీనిని పట్టించుకోవడం లేదు.

## ఆర్థిక పతనం

విషవాయు బాధితులు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యల వల్ల వారి పనిచేసే సామర్థ్యం బాగా దెబ్బ తినింది. బాధితులలో 80 శాతం కూలి చేసుకొని బ్రతికేవారు, లేదా చిల్లర వ్యాపారస్తులు. బండ్లు లాగేవాళ్లు, మూటలు వేసేవాళ్లు, మట్టిపని చేసేవాళ్లు, మోటార్ మెకానిక్‌లు, గుర్రపు బండ్లవాళ్లు, బీడీ కార్మికులు. విషవాయువు ప్రభావం వారి శరీరాల మీద పడిన తరువాత గతంలో లాగేవాళ్లు పనిచేసుకోలేకపోతున్నారు. బట్టల మిల్లులలో, కాగితం మిల్లులలో పని చేసే కార్మికులు విషవాయువు ప్రభావం వల్ల బలహీన పడిన స్థితిలో తాము పనిచేసే మిల్లులలోని కాలుష్యానికి గతంలో లాగ తట్టుకోలేకపోతున్నారు. నెలకు 20 రోజులు పని మానుకుంటున్నారు.

ఇది వారి కుటుంబాల ఆర్థిక పరిస్థితిపైన గట్టి ప్రభావం వేసింది. అసలే అనారోగ్యంగా ఉన్న స్థితిలో ఏదో ఒక విధంగా సంపాదించి నిత్య జీవిత ఖర్చులే కాక మందుల ఖర్చులు కూడ పెట్టుకోవలసి వస్తున్నది. వీరికి ఆర్థిక పునరావాసం కల్పించడానికి ప్రభుత్వం అనేక ప్రణాళికలు తయారు చేసింది. కానీ వాటిలో అమలు చేసినవి తక్కువ. అమలు చేసిన వాటిలో విజయవంత మయినవి కొన్నే. ఆ కొన్నిటిని కూడ మూసేస్తున్నారు. ఆర్థిక పునరావాసం అవసరమైన వారు 50 వేల మంది కాగా, ప్రభుత్వం ఉద్యోగాలు చూపించింది 100 మందికి.

--1987 లో భోపాల్ బాధితులకు ఉద్యోగాలు కల్పించటం కోసం ఒక ప్రత్యేక పారిశ్రామిక ప్రాంతాన్ని నెలకొల్పుతామని ప్రభుత్వం ప్రతిపాదించింది. 8 కోట్ల ఖర్చుతో 170 వర్క్ షాపులు నిర్మించారు. 10 వేలమందికి 34 రకాల వృత్తులలో శిక్షణ ఇస్తామన్నారు. అయితే ఆ తరువాత ఆ వర్క్‌షాపులను పదవ వంతు ధరకు ప్రైవేట్ పెట్టుబడిదార్లకు అమ్మివేయడం మొదలు పెట్టారు. 10 వేల ఉద్యోగాలకు బదులు 1 వెయ్యి ఉద్యోగాలు మాత్రమే వస్తాయని ఇప్పుడు అంటున్నారు.

--విషవాయుబాధితులయిన స్త్రీలకు కుట్టుపని కల్పించే ఒక కేంద్రాన్ని ప్రభుత్వం 1986 నుండి 92 దాకా నడిపింది. 2300 మంది స్త్రీలకు పని కల్పించి సాలీనా 1 కోటి రూ॥లు లాభం ప్రభుత్వానికి సమకూర్చింది ఈ కేంద్రం. అయితే ఈ కేంద్రం బాధితురాళ్లు గుమిగూడడానికీ, తమ సమస్యలు చర్చించుకొని సంఘటితం కావడానికీ ఉపయోగపడుతుందని చూసిన ప్రభుత్వం గాభరాపడి 1992 లో దానిని మూసేసింది. ఆ స్త్రీలందరూ నిరుద్యోగులయ్యారు.

బాధితుల పునరావాసంలో భాగంగా, చనిపోయిన వారి కుటుంబాలకు ఒక రెండు గదుల ఇల్లు నిర్మించి ఇవ్వడానికి ప్రభుత్వం ఒప్పుకుంది. అయితే ఇప్పటి దాకా 3000 ఇళ్లకు మాత్రమే బడ్జెట్ మంజూరయింది. అందులో 1000 ఇళ్లు మాత్రమే ఇప్పటి దాకా కట్టారు. అయితే ప్రభుత్వం నిర్మించిన ఈ కాలనీ (దీనిని 'విధవల కాలనీ' అంటున్నారు) ఒక్కొక్క బిల్డింగు నాలుగు అంతస్తుల ఎత్తుంది. అసలే శ్వాస సంబంధమైన రోగాలున్న బాధితులు ఎక్కి దిగలేక చస్తున్నారు.

1986-1993 మధ్యకాలంలో బాధితుల నివాస ప్రాంతాలలో రోడ్ల మరమ్మతు కోసం, మురుగు కాలువల కోసం, ఇతర అవసరాల కోసం 32.16 కోట్ల రూ॥లు మంజూరయ్యాయి. అయితే ఈ డబ్బు బాధిత ప్రాంతాలలో ఖర్చు పెట్టడం లేదు. భోపాల్ మునిసిపల్ కార్పోరేషన్ ఆధ్వర్యంలో ఈ డబ్బు ఆ నగర అభివృద్ధికి వెచ్చించబడింది. నగరంలో వీధిదీపాలకోసం, బస్‌స్టాండ్‌లో, రైల్వేస్టేషన్‌లో మూత్రశాలలు నిర్మించడం కోసం, విదేశాల నుండి చెత్త ఎత్తిపోసే యంత్రాలు దిగుమతి చేసుకోవడం కోసం దీనిని ఉపయోగించారు.

## న్యాయవ్యవస్థ ఏం చేస్తూ ఉంది ?

యూనియన్ కార్బైడ్ కార్పొరేషన్ చైర్మన్ వారన్ ఆండర్సన్ మీద, భోపాల్ ఫ్యాక్టరీ అధికార్లమీద వెంటనే కేసు పెట్టారు. 1987 డిసెంబర్ 1 నాడు సిబిఐ ఈ కేసులో చార్జిషీటు కూడ దాఖలు చేసింది. అయితే నేరం జరిగి 10 సంవత్సరాలు గడిచినా భోపాల్ కోర్టులో నేర విచారణ ఇంకా ప్రారంభం కాలేదు. వారన్ ఆండర్సన్ నేరంజరిగిన కొద్దిరోజులకే అరెస్టయి వెనువెంటనే వ్యక్తిగత పూచీ కత్తుమీద బెయిలు పొందాడు. ప్రభుత్వమే అతనిని విమానం మీద గట్టి బంధోబస్తులతో ఢిల్లీకి తరలించి, అక్కడి నుండి అమెరికాకు వెళ్లిపోయే అవకాశం కల్పించింది. ఆ తరువాత ఆండర్సన్ పత్తాలేడు. భారత దేశానికి రాడు, కోర్టులో హాజరుకాడు. అతని కోసం భోపాల్ చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేటు సమ్మన్స్ జారీ చేసారు. అయినా ఫలితం లేదు. అతడు 'భారతీయ కోర్టులకు నా మీద అధికారం లేదు' అంటాడు. అతనిని భారతదేశానికి పంపించవలసిందిగా అమెరికా ప్రభుత్వాన్ని భారత ప్రభుత్వం కోరవలసిందనీ, దానికి కావలసిన చర్యలన్నీ తీసుకొమ్మనీ భోపాల్ జిల్లాకోర్టు సిబిఐని ఆదేశించింది. అయితే అంతటి చొరవ తీసుకోవాలన్న ఆసక్తి ప్రభుత్వానికి లేదు.

చనిపోయిన వారి కుటుంబాలకూ, రోగగ్రస్తులయిన వారికీ నష్టపరిహారం యిప్పించడానికి కోర్టులో వేసిన సివిల్ దావాలు తేలక ముందే 1989 లోనే భారత ప్రభుత్వం కార్బైడ్‌కంపెనీతో ఒక ఒప్పందానికి వచ్చింది. ఆ ఒప్పందం ప్రకారం కార్బైడ్ కంపెనీ బాధితుల కివ్వవలసిన నష్టపరిహారానికి గాను 1500 కోట్లు రూపాయలు చెల్లిస్తుంది. అక్కడితో కంపెనీ బాధ్యత తీరిపోతుంది. కంపెనీ ఇచ్చిన ఈ మొత్తాన్ని నెమ్మదిగా బాధితులకు పంచుతున్నారు. చనిపోయిన వారి కుటుంబాలకు 93,000 రూపాయలు, రోగగ్రస్తులయిన వారికి 27,000 రూపాయలు దక్కుతున్నాయి. ఇవి చాలా తక్కువ మొత్తం. అమెరికాలోనే ఈ దుర్ఘటన జరిగి ఉంటే ఇంతకు కనీసం 50 రెట్లు నష్టపరిహారం చెల్లించవలసి ఉండేది. బాధితులందరి తరపున తానే దావా వడిపే అధికారాన్ని భారత ప్రభుత్వం ఒక చట్టం ద్వారా 1985 లో తనకు తాను దత్తం చేసుకొని ఈ సిగ్గుమాలిన ఒప్పందం చేసుకుంది. ఈ 1500 కోట్లు చెల్లించేస్తే ఇంక నష్టపరిహారం చెల్లించనవసరం లేకపోవడమే కాదు, కార్బైడ్ కంపెనీ మీద క్రిమినల్ కేసులు కూడ తొలగిపోతాయని ఈ ఒప్పందంలో రాసుకున్నారు. ఈ ఒప్పందం, దాని ప్రాతిపదిక అయిన చట్టం రాజ్యాంగ సమ్మతమేనని సుప్రీంకోర్టు 1989లో తీర్పు ఇచ్చింది. అయితే దాని మీద భోపాల్ బాధితుల సంఘాలు సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనానికి అప్పీలు చేసుకోగా, డబ్బులు చెల్లిస్తే క్రిమినల్ కేసులు పోతాయనడం చట్టసమ్మతం కాదనీ, క్రిమినల్ కేసులు మాత్రం కొనసాగుతాయనీ, మిగిలిన అన్ని విషయాలలోనూ ఒప్పందం సవ్యమైనదేననీ కోర్టు 1991 లో తీర్పు ఇచ్చింది. అయితే కోర్టు అదనంగా ప్రజలకు ఏం మేలు చేసిందంటే, వాయుపీడిత ప్రజలకు వైద్యసదుపాయం కల్పించడానికి కార్బైడ్ కంపెనీ భోపాల్ లో 500 పడకల ఆస్పత్రి కట్టియ్యాలని ఆదేశించింది. కంపెనీ దీనిని కూడ తనకు అనుకూలంగా వాడుకోవాలని ప్రయత్నించింది. ఆస్పత్రి కట్టాలంటే భోపాల్ కంపెనీ షేర్లు కొన్ని అమ్ముకోవడానికి అనుమతి కావాలని కోరింది. భోపాల్ చీఫ్ జుడీషియల్ మెజిస్ట్రేట్ భోపాల్ కంపెనీ షేర్ల అమ్మకం మీద స్టే ఇచ్చారు. షేర్లు అమ్ముకొని వెళ్లిపోనిస్తే ఆండర్సన్ తదితర కంపెనీ అధికార్లు ఇంక చట్టానికి దొరకరన్న హేతుబద్ధమైన వాదనతో ఆయన స్టే ఆర్డర్ ఇచ్చాడు. ఆస్పత్రి కట్టడం అనే పేరు మీద ఈ స్టేని తొలగించడానికి ఆయన నిరాకరించాడు. 'కార్బైడ్ కంపెనీ దగ్గర ఆస్పత్రికి కావలసిన 50 కోట్ల రూపాయలు లేవంటే నేను నమ్మలేను' అన్నాడు. అయితే కార్బైడ్ కంపెనీ సుప్రీంకోర్టుకు పోయి షేర్లు అమ్ముకోవడానికి అనుమతి తెచ్చుకుంది.

మృతులు ఒక్కొక్కరికి 93 వేలు, బాధితులకు 27 వేలు ఇచ్చి యూనియన్ కార్బైడ్ తప్పించుకుంది. సుప్రీంకోర్టు దీనిని ఆమోదించి, 'ఇంకా ఏమైనా చెల్లించేది ఉంటే, సంక్షేమ రాజ్యమయిన భారత ప్రభుత్వం చెల్లిస్తుంది' అని చెప్పింది. అదికూడ సంక్షేమ రాజ్యంగానే తప్ప భోపాల్ మారణకాండలో భాగస్వామ్యం ఉన్న తోడు దొంగగా కాదు. అంటే (చట్టపరిభాషలో) భారత ప్రభుత్వానికీ కార్బైడ్ కంపెనీకీ ఈ విషయంలో జాయింట్ లయబిలిటీ ఉందన్న వాదనను కోర్టు తిరస్కరించిందన్నమాట. 'సంక్షేమ రాజ్యంగా భారత ప్రభుత్వం ప్రజల క్షేమానికి ఏ మాత్రం ఖర్చు పెడుతున్నదో మనకు బాగానే తెలుసును కాబట్టి భోపాల్ బాధితుల నష్టపరిహారం కథ సమాప్తమయి నట్టే భావించాలి. కార్బైడ్ కంపెనీని ఇంత చవకగా వదిలిపెట్టడం భారత ప్రభుత్వానికీ న్యాయవ్యవస్థకూ సిగ్గుచేటు అన్న అభిప్రాయంతో అందరూ ఏకీభవిస్తారు.

## భోపాల్ తరువాత దేశంలో జరిగిన పెద్ద పారిశ్రామిక ప్రమాదాలు

| తేదీ | స్థలం | మృతులు | గాయపడిన వారు | ప్రమాదం స్వభావం |
|---|---|---|---|---|
| మే 1988 | అహ్మదాబాద్ గుజరాత్ | 19 | 53 | ఆసిడ్ టాంకర్ తిరగబడడం |
| అక్టోబర్ 1989 | గంజాం, ఒరిస్సా | 6 | 100 | 'క్లోరినేటర్స్ ఇండియా' ఫ్యాక్టరీలో క్లోరిన్‌వాయువులీక్ |
| నవంబర్ 1990 | నాగోథానె మహారాష్ట్ర | 35 | 50 | ఇండియన్ పెట్రో కెమికల్స్ లో పేలుడు |
| 1991 | గ్వాలియర్ మధ్యప్రదేశ్ | 9 | 100 | గ్వాలియర్‌రేయాన్స్ కంపెనీలో పేలుడు |
| నవంబర్ 1991 | దహను మహారాష్ట్ర | 100 | 19 | తిరగబడిన కెమికల్ టాంకర్ పేలుడు |
| ఏప్రిల్ 1992 | నయాబజార్, ఢిల్లీ | 12 | - | గోడౌన్‌లో పేలుడు |
| సెప్టెంబర్ 1992 | పానిపట్, హర్యానా | 11 | 11 | నేషనల్ ఫెర్టిలైజర్ ప్లాంట్‌లో అమ్మోనియా లీక్ |
| మార్చి 1993 | సహాద్, మహారాష్ట్ర | 11 | 123 | సెంచరీ రేయాన్‌లో సల్ఫ్యూరిక్ ఆసిడ్‌లీక్ |
| అక్టోబర్ 1994 | ఝాన్సీ, ఉత్తరప్రదేశ్ | 30 | 25 | ఒక ఫ్యాక్టరీలో పేలుడు |